సాక్షి
కాకినాడ

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



ఫ్రీ బస్ పాసుల పంపిణీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రెడ్‌కాన్వెంట్ పూర్వవిద్యార్థుల చారిట్రబుల్ ట్రస్ట్ ద్వారా శనివారం సాలిపేట బాలికల పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బస్సు పాసులు అందజేశారు.



శ్రీవారి పథకాలకు విరాళం


ద్వారకాతిరుమల: శ్రీవారి పథకాలకు హైదరాబాద్‌కు చెందిన వెంపడ సురేష్, శ్రీలత దంపతులు శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు.

డెల్టాలకు 11,100 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శనివారం 11,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,500, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. అలాగే బ్యారేజీ నుంచి 97,352 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు.

పంట మార్పిడికి పెద్దపీట

- ఐదేళ్లలో 75 శాతం తగ్గిన తెల్లబంగారం సాగు
- ప్రత్యామ్నాయ పంటల వైపు అన్నదాతల చూపు
- ప్రభుత్వ ప్రోత్సాహకాలతో లాభాల సాగు
- ఫలించిన వ్యవసాయ అధికారులు ప్రయత్నం



రాతులపూడిలో పత్తికి బదులు తీగ జాతి పంటను సాగు చేసిన దృశ్యం

తుని: ఒకప్పుడు రైతులకు సిరులు కురిపించిన తెల్ల బంగారం ప్రస్తుతం నష్టాలను మిగుల్చుతోంది. గతంలో మెట్ట రైతులు పత్తిని ఎక్కువగా సాగు చేసేవారు. వాతావరణ పరిస్థితులు, గులాబీ రంగు పురుగు ఉధృతితో గత కొన్నేళ్లుగా నష్టాలు రావడంతో రైతులు పంట మార్పిడికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో జిల్లాలో ఐదేళ్లలో పత్తిసాగు 75 శాతం మేర తగ్గింది. 2019 నుంచి 2023 వరకు చూస్తే 15,945 హెక్టార్ల నుంచి 6,792 హెక్టార్లకు పడిపోయింది. వరి, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రభుత్వం రైతులకు యాంత్రీకరణ పరికరాలు, రైతు భరోసా సాయం, విత్తనాలు, ఎరువుల రాయితీ, ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం తదితర సదుపాయాలను కల్పిస్తోంది. ఎన్నో ఏళ్లగా ఒకే పంటను సాగు చేయడం వలన కలిగే నష్టాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు గమనించి ఇచ్చిన సూచనలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి.

మంగు పంట పత్తి

పత్తి పంట భారీ వర్షాలను, ఎండలను తట్టుకోవడంతో మెట్ట ప్రాంతంలో రైతులు ఎక్కువగా పత్తిని సాగు చేసేవారు. ఒకే పంటను ఏళ్ల తరబడి వేయడంతో భూసారం తగ్గి తెగుళ్లు సోకాయి. దీంతో దిగుబడి తగ్గిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఈ పరిస్థితిని గమనించిన వ్యవసాయ శాఖ అధికారులు పంట మార్పిడి విధానం పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు. తొలుత అంతంతమాత్రంగా స్పందన వచ్చినా గత ఐదేళ్లలో 75 శాతం మంది రైతులు పత్తి సాగుకు తాత్కాలిక విరామం ప్రకటించారు. తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల్లో రైతులు పత్తికి బదులుగా వరి, పెసర, మినప, కంది, మల్బరీ, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయల పంటలను వేసి మంచి ఆదాయాన్ని పొందుతున్నారు.

ఐదేళ్లలో పత్తి సాగు వివరాలు

సంవత్సరం	సాగు అంచనా (హెక్టార్లలో)	సాగు చేసింది (హెక్టార్లలో)
2019–20	3,997	3,332
2020–21	3,613	1,237
2021–22	3,047	719
2022–23	2,428	712
2023–24	2,860	792
మొత్తం	15,945	6,792

ఇలా చేస్తే మంచి ఫలితాలు

- ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంట సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.
- తేలికపాటి నెలల్లో వేసిన పంటకు గులాబీరంగు పురుగు ఆశించే అవకాశం ఉంది. ఈ పురుగు పంట ఆశిస్తే తీవ్రనష్టం కలుగుతుంది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పత్తికి గులాబీరంగు పురుగు సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.
- పురుగులు, తెగుళ్ల నివారణకు పత్తి పంట వేసిన పొలం గట్లపై కంది, నాలుగు దిక్కులా పసుపు రంగు బంతి సాగు చేయాలి. పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలి. రసం పీల్చే పురుగుల నియంత్రణకు జిగురు పూసిన పసుపు రంగు అట్టలు ఎకరాకు 4 నుంచి 6 ఏర్పాటు చేసుకోవాలి. లింగాకర్షణ బుట్టలు పెట్టుకోవాలి.
- పంట వేసిన 30 రోజుల వరకు కాండంపై మనోక్రొటిఫాసు 1:4 నిష్పత్తిలో బ్రెస్‌తో పూయాలి. పూత, పిందె దశలో ఎక్కువగా క్రిమి సంహారక మందులను వినియోగించడం మంచిది కాదు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే పురుగు మందులు వాడాలి.

ఎరువుల యాజమాన్యం

పంట మొక్క దశలో ఉన్న సమయంలో అనుకూలమైన తేమ ఉన్నప్పుడు ఎకరాకు బస్తా డీఏపీ, 3 బస్తాలు సూపర్ ఫాస్ఫేట్ వేయాలి. 120 కిలోల యూరియా, 40 కిలోల పొటాష్‌ను నాలుగు దఫాలుగా పంటకు వేస్తే సరిపోతుంది. యూరియా ఎక్కువ వాడితే రసం పీల్చే పురుగులు ఆశిస్తాయి. వర్షం కురిస్తే చేలో నీరు నిల్వ ఉండిపోకుండా చూడాలి.

స్వల్పకాలిక పంటలతో లాభాలు



పత్తికి బదులు స్వల్పకాలిక పంటలను సాగు చేసుకోవడం మంచిది. ఆదాయం ఎక్కువ వస్తుంది. పెట్టుబడి తగ్గుతుంది. ప్రస్తుతం రైతుల్లో పంటల మార్పిడిపై అవగాహన పెరిగింది. ఒకే పంటను వేయడంతో భూసారం తగ్గి పోయి భూమి నిస్సారంగా మారుతుంది. గులాబీ రంగు పురుగు నియంత్రణ కష్టం. ఈ పురుగు నివారణకు భారీగా ఖర్చు అవుతుంది. పంట మార్పిడి విధానం మంచి ఫలితాలను ఇస్తుంది. – **విజయ్‌కుమార్, జేడీ, కాకినాడ**

అపరాలు సాగు చేశా..



గతంలో నాలుగు ఎకరాల్లో పత్తి వేశాను. గులాబీ రంగు పురుగు సోకి దిగుబడి రాలేదు. పెట్టుబడి రూ.1.20 లక్షలు అయ్యింది. చేతికి రూ.80 వేలు వచ్చింది. రెండేళ్లుగా పెసర, మినప, కంది సాగు చేశాను. పెట్టుబడి కంటే రెండింతల ఆదాయం వచ్చింది. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తే ఎంతో మేలు జరిగింది.
– **పి.మాణిక్యాలరావు, రైతు, తుని మండలం**

న్యూస్‌రీల్

రత్నగిరికి పోటెత్తిన భక్తజనం

స్వామివారిని దర్శించిన 50 వేల **మంది**



తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న సత్యదేవుడు

అన్నవరం: శ్రావణమాస తొలి శనివారం, శుద్ధ తదియ పర్వదినం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు సత్యదేవుని దర్శించేందుకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సుమారు 60 వేల మంది భక్తులు దర్శించి పూజలు చేశారు. స్వామివారి ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. సత్యదేవుని ప్రదక్షిణ దర్శనానికి గంట, సాధారణ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారి వ్రతాలు నాలుగు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షలు ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో సుమారు నాలుగు వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంత లక్ష్మీసత్యవతి అమ్మవార్లకు తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. తర్వాత ఆలయ ప్రాంగణం మూడు సార్లు ప్రదక్షిణ చేయించిననంతరం మళ్లీ పూజలు చేసి తిరిగి ఆలయానికి చేర్చారు.

జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



డాక్టర్ మల్లికార్జున్



పాలిక చిన్నఅప్పారావు

కాకినాడ: జిల్లా వైఎస్సార్ సీపీ ప్రచార, వైద్య విభాగాలకు అధ్యక్షులు నియమితులయ్యారు. శనివారం సాయంత్రం వీరి నియామకాలను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడిగా డాక్టర్ మాజేటి మల్లికార్జున్ నియమితులయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తూ మూడేళ్ల కిందట ఆయన ఉద్యోగ విరమణ పొందారు. నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రామ్ అధికారిగా, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా కూడా పనిచేశారు. ఇమ్యూనైజేషన్‌లో 96 శాతం ఫలితాన్ని సాధించి జాతీయ స్థాయిలో అవార్డు పొందారు. జగ్గంపేట నియోజకవర్గానికి చెందిన పాలిక చిన్న అప్పారావు కాకినాడ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షునిగా నియమితులయ్యారు. శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన ఆయన పదేళ్లుగా పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పని చేస్తున్నారు.

జగనన్న కాలనీలో పనుల పరిశీలన

సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు



సామర్లకోట జగనన్న కాలనీలో పనులపై డ్వామా పీడీతో మాట్లాడుతున్న దొరబాబు

సామర్లకోట: స్థానిక ఈటీసీ లేఅవుట్‌లోని జగనన్న కాలనీని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శనివారం పరిశీలించారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోట జగనన్న కాలనీలో సామూహిక గృహ ప్రవేశాలకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో కాలనీలో జరుగుతున్న రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు, ఆర్చి, ముఖద్వారం వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 18 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులతో దొరబాబు సమీక్షించారు. రోడ్లు, డ్రైన్ల పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వీఐపీలతో పాటు సమావేశానికి వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల వాహనాలను పార్కింగ్ చేసే ప్రదేశాలను దొరబాబు పరిశీలించారు. సామర్లకోట– పెద్దాపురం రోడ్డులోని ప్రైవేట్ లేఅవుట్‌లో ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగే ప్రదేశాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై పోలీసుల అధికారులతో చర్చించారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి, హౌసింగ్ డీఈ కేఎస్‌కే రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు ఉన్నారు.

వార్డు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా

జిల్లాలో 17 వార్డు సభ్యుల విజయం



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ దుందుభి మోగించింది. మొత్తం 17 వార్డు స్థానాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. తమ హవా చాటుకున్నారు. ఒక సర్పంచ్, 27 వార్డు సభ్యుల ఎన్నికకు ఈ నెల 6న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యింది. 21 వార్డులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలవ్వడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. శనివారం సర్పంచ్, ఆరుగురు వార్డు సభ్యుల ఎన్నికలు జరిగాయి. సాయంత్రం ఫలితాలను ఎన్నికల అధికారులు ప్రకటించారు. తాళ్లరేవు మండలం జార్జిపేటకు చెందిన గుత్తుల సత్యవేణి సర్పంచ్ విజయం సాధించారు. వార్డు సభ్యులుగా గొల్లప్రోలు మండలం కొడవలి 12వ వార్డు సభ్యుడిగా ఎం.మనియ్య, పెదపూడి మండలం కాండ్రేగుల పంచాయతీ 3వ వార్డు సభ్యుడిగా పేపకాయల ప్రవీణ్, పెద్దాపురం మండలం దివిలి 7వ వార్డు సభ్యులుగా కుంచే శాంతి, ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి 6వ వార్డు సభ్యురాలిగా నమ్మి లోవలక్ష్మి, సామర్లకోట మండలం చంద్రంపాలెం 4వ వార్డు సభ్యుడిగా తోట మణికంఠ, సామర్లకోట మండలం వేట్లపాలెం 14వ వార్డు సభ్యుడిగా బొబ్బరాడ రాజు విజయం సాధించారు. ఏకగ్రీవంతో కలుపుకొని 27 వార్డులలో 17 మంది వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేశారు. కొన్నిచోట్ల స్వతంత్రులు విజయం సాధించారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వాహనం అందజేస్తున్న మంత్రి అప్పలరాజు, చిత్రంలో ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే దొరబాబు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మత్స్య పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. స్థానిక జగన్నాథపురంలోని మత్స్యశాఖ కార్యాలయంలో కాకినాడకు చెందిన కాశీ జానకిరామ్‌కు మత్స్యశాఖ ద్వారా మంజూరైన ఇన్సులేటెడ్ ఫిష్ ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, జనరల్ అభ్యర్థులకు 40 శాతం రాయితీతో వాహనాలు అందజేస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీవీ సత్యనారాయణ, సహాయ సంచాలకుడు కె.కరుణాకరరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆర్.నూకరాజు, జిల్లా మత్స్య సహాయకుల సంఘ అధ్యక్షుడు చాగంటి పరశురామ్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

- అంతా సమన్వయంతో పనిచేయాలి
- పిఠాపురం నియోజకవర్గ సమీక్షలో మంత్రి అప్పలరాజు



సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, చిత్రంలో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ, మత్స్య శాఖల మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ విధాన గౌతమీ సమావేశ మందిరంలో పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై మంత్రి అప్పలరాజు, ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణలు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నియోజకవర్గాన్ని ముందు వరుసలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద లేఅవుట్లలో ఇప్పటికే పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఏలేరులో ప్రస్తుతం 8.5 టీఎంసీల లైవ్ స్టోరేజ్ ఉందని, అందువల్ల ఏలేరు, పీబీసీ వ్యవస్థల ద్వారా శివారు భూములకూ సాగునీరు అందేలా ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు, ఆకాంక్షల మేరకు లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటికే జగ్గంపేట, కాకినాడ అర్బన్, పిఠాపురం నియోజకవర్గాల సమావేశాలు పూర్తయినందున వచ్చే వారం ప్రత్తిపాడు, కాకినాడ రూరల్ సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి వివరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాల పరిష్కారానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎంపీ గీత మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ పరిధిలో ఎంపీ ల్యాడ్స్ ద్వారా మంజూరైన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. త్వరలో మరో రూ. కోటి విలువైన ప్రాధాన్య పనులను ఎంపీ ల్యాడ్స్ పరిధిలో మంజూరు చేస్తామన్నారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు, టిడ్కో ఇళ్లు, 90 రోజుల్లో ఇంటి పట్టాలు, ఖరీఫ్ ఈ–క్రాప్ బుకింగ్, సాగునీరు, ఏలేరు ఆధునీకరణ, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, మన బడి నాడు–నేడు పనులపై చర్చ జరిగింది. ఖరీఫ్‌లో సాగునీటి సమస్యలు రాకుండా చూస్తామన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాల ను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చే స్తామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, సీపీవో పి.త్రినాథ్, పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పీఎంజీకేఏవైలో 5.23 లక్షల టన్నుల బియ్యం పంపిణీ

ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ విమలాక్ష గౌతమ్

కాకినాడ సిటీ: రాష్ట్రంలో పీఎంజీకేఏవై పథకం కింద 5,23,877 మెట్రిక్ టన్నుల ఉచిత బియ్యాన్ని ఎఫ్‌సీఐ పంపిణీ చేసిందని ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ విమలాక్ష గౌతమ్ తెలిపారు. దీనికి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని జోడించామన్నారు. శనివారం కాకినాడ డిపో ఎఫ్‌సీఐలో మేనేజర్ ఎంవీఎస్ఎస్ ముత్యాలరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాల్లో 17 లక్షల మంది చిన్నారులకు ఐసీడీఎస్ ద్వారా ఎండీఎం(మిడ్‌డే మీల్) పంపిణీ చేశామన్నారు. టీపీడీఎస్, పోషకాహార లోపానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం, ఇతర శాఖల ఆదేశాల మేరకు ఎఫ్‌సీఐ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఆయన వివరించారు. 24 ఫీల్డ్ డిపోలతో పనిచేస్తున్న ఎఫ్‌సీఐ రాష్ట్ర శాఖ 7,00466 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం నుంచి 8,71,082 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యానికి పెంచిందన్నారు. పీఎం పోషణ్, ఐసీడీఎస్ ఇతర సంక్షేమ పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం బలవర్ధకమైన బియ్యం సరఫరా చేస్తోందన్నారు. 2022–23కి దాదాపు 134 లక్షల మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యం నిల్వలు పంపిణీ చేశామన్నారు. ఇప్పటివరకూ 27 రాష్ట్రాలలోని 269 జిల్లాల్లో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందజేశామన్నారు. క్వాలిటీ మేనేజర్ నరేష్ మాట్లాడుతూ ఎఫ్‌సీఐ ఏపీ రీజియన్‌లో ఇతర దక్షిణాది రాష్ట్రాలు, అండమాన్ నికోబార్ దీవులు, ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలతో పోలిస్తే ఆహార ధాన్యాల సరఫరాలో రాష్ట్ర ఎఫ్‌సీఐ ప్రశంసనీయమైన పాత్ర పోషించిందన్నారు. మేనేజర్లు రవిబాబు, తిగ్గ, సహాయులు సత్యశివ, సిద్ధార్థ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాడపల్లి వెంకన్నకు రూ.35.10 లక్షల ఆదాయం



ఆలయంలో భక్తజనసందోహం



ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శనివారం రూ.35,10,670 ఆదాయం సమకూరింది. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ విక్రయం, విరాళాల ద్వారా ఈ ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామివారిని వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. సుమారు 35 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

దూసుకువచ్చిన మృత్యువు

- ట్రాలీ ఢీకొని ఇద్దరి దుర్మరణం
- రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం

కిర్లంపూడి: బైక్‌పై వెళ్తున్న ఆ ఇద్దరి పైకి ట్రాలీ రూపంలో మృత్యువు దూసుకువచ్చింది. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరంలో జరిగిన ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. కిర్లంపూడి ఎస్సై బి.ఉమామహేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని సింహాద్రిపురం అడ్డురోడ్డు నర్సరావు కాలనీకి చెందిన గొడుగుల దుర్గామల్లేశ్ (21) అడ్డురోడ్డులో మోటార్ సైకిల్ మెకానిక్ షాప్ నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఇసుకపల్లి బాల వీర వెంకట సత్య దుర్గసాయి అలియాస్ బాలు (15) ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరూ కలసి శుక్రవారం అర్ధరాత్రి ప్రత్తిపాడు వైపు బైక్‌పై వెళ్తున్నారు. అదే మార్గంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ జగపతినగరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వీరి బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలు అక్కడికక్కడే మరణించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దుర్గా మల్లేశ్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై శనివారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.



విలపిస్తున్న మల్లేశ్ భార్య, కుటుంబ సభ్యులు



మృతులు దుర్గా మల్లేశ్, బాలు (పాత చిత్రాలు)

వివాహమైన కొద్ది నెలల్లోనే..

ఈ ప్రమాదంలో మృతుడు దుర్గా మల్లేశ్ 15 నెలల కిందటే ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏలేశ్వరం మండలం మొక్కారావు కాలనీకి చెందిన కొండేటి సోమరాజు కుమార్తె దేవి, మల్లేశ్ ప్రేమించుకుని, గత ఏడాది మే నెలలో పెళ్లి చేసుకున్నారు. ప్రేమించిన వ్యక్తితో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని దేవి ఎన్నో కలలు కంది. ఆ కలలు నెరవేరకుండానే ట్రాలీ రూపంలో మృత్యువు తన భర్తను బలిగొందని దేవి పెద్ద పెట్టున విలపిస్తోంది. మృతుడు మల్లేశ్‌కు భార్యతో పాటు తల్లిదండ్రులు నాగమణి, చిన్నరామస్వామి, సోదరి ఉన్నారు. అతడి మృతితో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.


ప్రయోజకుడిని చేయాలని..

శివమ్మ, వీరబాబు దంపతులకు బాలు లేకలేక పుట్టిన ఒక్కగానొక్క సంతానం. దీంతో అతడిని ఎంతో గారాబంగా పెంచుకుంటున్నారు. తాము పడుతున్న ఇబ్బందులు కొడుకు పడకూడదనే ఉద్దేశంతో వడ్రంగి పనికి వెళ్తూ.. బాలును వారు బాగా చదివించుకుంటున్నారు. పెద్దయ్యాక ప్రయోజకుడై తమకు ఆసరాగా నిలుస్తాడని జీవిస్తున్న తమ ఆశల్ని మృత్యువు చిదిమేసిందంటూ బాలు తల్లిదండ్రులు గుండెలు పగిలేలా విలపిస్తున్నారు.

డ్రైవింగ్, ఆర్‌సీ కార్డులకు చెల్లు


- ఏపీ ఆర్‌టీఏ యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసిన పత్రం చాలు
- అమల్లోకి నూతన నిబంధన
- ఇప్పటి వరకూ పెండింగ్‌లో ఉన్న 35 వేల కార్డుల జారీకి ఏర్పాట్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ కార్డు) పొరపాటున ఇంటి వద్ద మరచిపోయి, కారు, బైక్‌తో రోడ్డు మీదకు రావడం.. పోలీసులు, రవాణా అధికారులు ఫైన్ వేయడం.. తరువాత వాటిని చూపిస్తే ఫైన్ మాఫీ చేయడం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం అటువంటి కష్టాలకు చెక్ పడింది. డ్రైవింగ్, ఆర్‌సీ కార్డుల స్థానంలో సంబంధిత యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న పత్రం చూపిస్తే సరిపోయే సరికొత్త విధానం ఆరంభమైంది. రవాణా శాఖకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ వాహన్ పరివార్ సేవలన్నీ ఇప్పటికే ఆన్‌లైన్ అయ్యాయి. చాలా రాష్ట్రాలో కార్డులు తొలగించి డిజిటల్ పత్రాలు తీసుకువచ్చారు. మన రాష్ట్రంలో కూడా దీని అమలును ఈ నెల 8న ఆరంభించారు. లైసెన్స్, ఆర్‌సీ జారీకి కార్డుకు రూ.200, పోస్టల్ చార్జీ రూ.25 తీసుకుని పోస్టల్ ద్వారా నేరుగా ఇంటికే పంపించేవారు. కార్డులు ప్రింట్ కాకపోవడం, పోస్టల్ ఆలస్యం వంటి కారణాలతో రెండు మూడు నెలలైనా కార్డు చేతికి రాని పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా దాదాపు 35 వేల ఆర్‌సీ, డ్రైవింగ్ కార్డులకు ఫీజు వసూలు చేశారు. వాటి వరకూ ప్రింట్ చేసి, వాహన చోదకులకు పంపించనున్నారు. రవాణా శాఖ వెబ్ సైట్ హెచ్‌టీటీపీఎస్//ఏపీఆర్‌టీఏసీ సిటిజన్.ఈప్రగతి.ఓఆర్‌టీ నుంచి ఫారం 6 లేదా 23 డౌన్‌లోడ్ చేసుకుని ధ్రువపత్రం తీసుకోవాలి. లేదా ఏపీఆర్‌టీఏ సిటిజన్ ఆండ్రాయిడ్ మొబైల్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాహనాలు తనిఖీ చేసేటప్పుడు పోలీస్ లేదా రవాణా అధికారులకు డౌన్‌లోడ్ చేసిన పత్రాలు చూపిస్తే సరిపోతుంది.



డ్రైవింగ్ లైసెన్స్

ఇకపై కార్డుల పంపిణీ ఉండదు



రవాణా శాఖ జారీ చేసే ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సులకు సంబంధించి ఇకపై కార్డులు పంపిణీ ఉండదు. ఇప్పటి వరకూ ఉన్న కార్డులు ప్రింట్ చేసి, త్వరలో వాహనదారులకు అందజేస్తాం. డ్రైవింగ్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు రవాణా శాఖ యాప్ నుంచి పత్రం డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది.

– ఎ.మోహన్,
జిల్లా రవాణా అధికారి, కాకినాడ

తుపాకీ పేలి బాలిక మృతి చెందిన కేసులో నలుగురి అరెస్టు

తుని రూరల్: నాటు తుపాకీ పేలి, నాలుగేళ్ల బాలిక మృతి చెందిన కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు రూరల్ సీఐ ఎ.సన్యాసిరావు శనివారం తెలిపారు. ఈ నెల 15వ తేదీన తుని మండలం లోవకొత్తూరులో నాటుతుపాకీ మిస్ ఫైర్ అయ్యి పలివెల ధన్యశ్రీ (4) మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎ.సన్యాసిరావు, ఎస్సై కె.విజయబాబు, పోలీసులు దర్యాప్తు చేశారు. బాధ్యులైన నలుగురు నిందితులను అరెస్టు చేసి, తుపాకీని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. అరెస్టయిన వారిలో లోవకొత్తూరుకు చెందిన సిద్ధాంతపు దుర్గాప్రసాద్, అనంతారపు సూరిబాబు, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం నర్సాపురానికి చెందిన యర్రంశెట్టి వలవు, కోటపాడు మండలం కె.సంతపాలెం గ్రామానికి చెందిన బల్లంకి సత్యనారాయణ ఉన్నారు. వారి నుంచి తుపాకీ స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వీరిని శుక్రవారం సాయంత్రం పాయకరావుపేట శివారులో అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని సీఐ వివరించారు.



స్వాధీనం చేసుకున్న తుపాకీ, నిందితులతో రూరల్ సీఐ, ఎస్సైలు

ముగిసిన శ్రీప్రకాష్ వ్యవస్థాపక వేడుకలు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల 47వ వ్యవస్థాపక వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీప్రకాష్ తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం శాఖల విద్యార్థులకు ఏర్పాటు చేసిన 'గాతా రహే మేరా దిల్' పాటల పోటీలకు హంగేరీ దేశానికి చెందిన ప్రముఖ పఖ్వాజ్ విద్వాంసులు బలాజ్స్ విరాగ్, టీఈ రాణి న్యాయ నిర్ణేతలుగా హాజరయ్యారు. విరాగ్ మాట్లాడుతూ, ప్రపంచంలో భారతీయ సంగీతం వైవిధ్యమైనదని అన్నారు. పాతశైలి పఖ్వాజ్ సంగీతంపై భావితరాలకు మక్కువ కలిగేలా ప్రదర్శనలు ఇస్తున్నానని చెప్పారు. భారతీయ శాస్త్రీయ సంగీతంలో దశాబ్దానికి పైగా శిక్షణ పొందిన తాను ఇప్పటికీ ప్రదర్శనల కంటే తన స్వీయ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. సంగీతాభిరుచి కలిగిన విద్యార్థులు నిత్య సాధనతోనే ఉత్తమ ఫలితాలు అందుకోగలరని చెప్పారు. విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీ నరసింహారావు మాట్లాడుతూ, తమ విద్యాసంస్థలు గత 47 సంవత్సరాలుగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాయని అన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శ్రీప్రకాష్ డిగ్రీ ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, రోటరాక్ట్ క్లబ్ విద్యార్థులు 120 యూనిట్ల రక్తం సేకరించి, కాకినాడ రోటరీ బ్లడ్‌బ్యాంకు, తుని మదర్ బ్లడ్‌బ్యాంకులకు అందజేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ యోగా గురువు వబ్బలరెడ్డి దుర్గాప్రసాద్‌ను శ్రీప్రకాష్ అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయప్రకాష్ సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, కన్వీనర్ సీతారాణి, ఏపీపీఎస్సీ సభ్యుడు సోనీవుడ్ తదితరులు పాల్గొన్నారు.



యోగా గురువు దుర్గా ప్రసాద్‌ను సత్కరిస్తున్న శ్రీప్రకాష్ అధినేత నరసింహారావు, కార్యదర్శి విజయ్‌ప్రకాష్